క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 16వ తేదీ శనివారం ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హాజీపూర్ ఏఈ మహేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గుడిపేట, నంనూర్, చందనాపూర్, ముల్కల్ల గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

నెన్నెల: మండలంలో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రాజన్న తెలిపారు. నెన్నెల సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ పనులు చేస్తున్న దృష్ట్యా నెన్నెల మండలం నందులపల్లి, గన్‌పూర్, జోగాపూర్, గొల్లపల్లి, మైలారం, మన్నెగూడం, ఖర్జీ, జంగాల్‌పేట, కోణంపేట, కుశ్నపల్లి, బొప్పారం, నెన్నెల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాదయాత్రకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న నాయకులు

దండేపల్లి: ఎస్సీవర్గీకరణకు వ్యతిరేఖంగా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం దండేపల్లి మండలంలోని కన్నెపల్లి నుంచి గూడెం గోదావరి వంతెన మీదుగా సాగింది. దీంతో కన్నెపల్లి గ్రామం వద్ద దండేపల్లి మండల మాల మహానాడు నాయకులు సుధాకర్‌కు స్వాగతం పలికి పాదయాత్రలో పాల్గొన్నారు. లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, జైభీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తం, రాష్ట్ర నాయకులు కనకరాజు దండేపల్లి మండల మాలమహానాడు అధ్యక్షుడు దయాకర్, నాయకులు రాజన్న, శ్రీనివాస్, వసంత్, అఖిల్ పాల్గొన్నారు.

రేపు అఖిల భారత సహకార వారోత్సవాలు

భీమారం: మండలంలోని కాజిపల్లిలో ఈ నెల 17న ఆదివారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గొర్రెలు, మేకలు పెంపకం వృత్తిదారుల సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ శుక్రవారం తెలిపారు. ఈ వారోత్సవాలకు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌తోపాటు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంలు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

17న ఆయుర్వేద వైద్యశిబిరం

మందమర్రిరూరల్: మందమర్రి సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఈ నెల 17న ఆదివారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ ఆఫీసర్(పీఎం) శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వైద్యులు విశ్వనాథ మహర్షి అందుబాటులో ఉంటారని సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఎం తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

నెన్నెల: బెల్లంపల్లి ప్రభుత్వ 100 పడకల ఆస్పత్రిలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించే మెగా కంటి ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం నెన్నెల మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ అవకాశాన్ని బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేష్, బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీను, మల్లాగౌడ్, సంధ్య, మొహిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన



పుస్తకాలు తిలకిస్తున్న పాఠకులు

మంచిర్యాలఅర్బన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తకాలు ప్రదర్శించారు. సీనియర్ సిటిజన్స్, పాఠకులు, లైబ్రేరియన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ లీకేజీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం శివారులోని ధర్మకాంట సమీపంలో నెల రోజులుగా మిషన్ భగీరథ మంచినీటి పైప్‌లైన్ లీకేజీతో పొలాల్లోకి నీరు చేరుతుండటంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి మరమ్మతు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

కార్తికం.. కమనీయం..!

- ఘనంగా కార్తిక పౌర్ణమి
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా కార్తిక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కేదారేశ్వర నోములు నోముకున్నారు. తులసిచెట్టుకు పూజలు నిర్వహించి ఉసిరిక దీపాలు వెలిగించి వత్తులు కాల్చారు.



ఆర్‌కేపీలో పూజల్లో పాల్గొన్న భక్తులు



చెన్నూర్ శివాలయంలో పూజలు

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

చెన్నూర్/చెన్నూర్‌రూరల్: చెన్నూర్ శివాలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు తెల్లవారు జామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపరాధనలు ఆచరించారు. గురువారం ప్రారంభమైన ఎక్కాహం ముగిసింది. ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం. స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు వేమారం మహేశ్వర్‌శర్మ, హిమకర్‌శర్మ, నాగేశ్వర్‌శర్మ, ముత్తేశ్వర్‌శర్మ పాల్గొన్నారు.



అభయాంజనేయ స్వామి ఆలయంలో..



పాలభిషేకం చేస్తున్న భక్తులు

బుగ్గ రాజేశ్వర ఆలయంలో..

కాసిపేట: కాసిపేట, బెల్లంపల్లి, తాండూర్ మండలాల శివారు ప్రాంతంలోని బుగ్గ రాజరాజేశ్వర ఆలయంలో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకొని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు ప్రత్యేకంగా అభిషేకాలు చేపిస్తూ శివలింగానికి పాలభిషేకం చేశారు. ఉసిరిక దీపాలు వెలిగించారు. భక్తులు క్యూ లైన్‌లలో వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.



ఉసిరిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



భీమారం: కోదండరామాలయంలో...



మందమర్రిలో సత్యనారాయణ వ్రతాలు



యలిశాలలో మల్లన్నస్వామి పెద్దపట్నం

గంగారాం అభయాంజనేయస్వామి ఆలయంలో..

భీమారం/నెన్నెల/వేమనపల్లి/మందమర్రిరూరల్/జైపూర్/: మండలంలోని గంగారాం అభయాంజనేయస్వామి ఆలయం, గంగాధర దేవాలయం హన్మాన్ మందిరంలో పూజలు చేశారు. మందమర్రి మూడో జోన్ రామాలయంలో, భీమారం కోదండరామాలయంలో పూజలు నిర్వహించారు. జైపూర్ యలిశాలలోని మల్లన్నకు పెద్దపట్నం వేసి మొక్కులు తీర్చుకున్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని కోదండ రామాలయంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, సహస్ర నామార్చన, సత్యనారాయణ వ్రతం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని శివాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.



నెన్నెల: గంగారాం అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గుడిపేట గోవింద క్షేత్రంలో...



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో కార్తిక శోభ సంతరించుకుంది. ముల్కల్ల గోదావరి పుష్కర ఘాట్‌కు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని పవిత్ర గోదావరి పుణ్యస్నానాలు ఆచరించారు. గోదారమ్మకు టెంకాయలు కొట్టి దీపాలు వెలిగించి గోదావరిలోకి వదిలిపెట్టారు. గోదావరి తీరాన శివుడికి అభిషేకాలు జరిపి శివపార్వతులను, గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఉసిరి చెట్టు వద్ద ఉసిరి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులకు దీపాలు, నవధాన్యాలు దానంగా ఇచ్చారు.

జన్నారంలో...

జన్నారం: మండలంలో కార్తిక పూర్ణిమ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి పూజలు జరిపారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో, రేండ్లగూడలోని శ్రీ సీతారామాలయాలకు భక్తులు పోటెత్తారు. సీతారామాలయంలో గ్రామస్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. ఉసిరి చెట్టు కింద 365వత్తులతో దీపాలు వెలిగించారు.



రేండ్లగూడలో సత్యనారాయణ వ్రతం

సత్యనారాయణ స్వామి వ్రతాలు

భీమిని: కన్నెపల్లి, భీమిని మండలాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి అభయాంజనేయ స్వామి, రెబ్బెన గ్రామంలో ఉసిరి చెట్టు వద్ద సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం వన భోజనాలు చేపట్టారు.



టేకులపల్లిలో...

చైన్‌మెన్ పదోన్నతికి పరీక్షలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా వీటీసీలో హెడ్ చైన్‌మెన్ పదోన్నతుల కోసం చైన్‌మెన్లకు శుక్రవారం పరీక్షలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ హాజరయ్యారు. మొత్తం 4 హెడ్ చైన్‌మెన్ పోస్టులకు పరీక్షలు నిర్వహించి పదోన్నతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాక్టికల్స్, రాత పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను లాటరీ పద్ధతిలో తీసి ఎంపిక చేశారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, వీటీసీ మేనేజర్ కల్లూరి వెంకటరామారావు, ఎస్ఈ కిరణ్‌కుమార్, డీవైపీఎంలు ఎస్వీ రాజేశ్వర్‌రావు, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్ఓటు జీఎం

బొగ్గుబాయి వార్తలు

ఐటీ ఆప్షన్‌కు 26న చివరి గడువు

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ పన్ను విధానం ఆప్షన్ ఎంచుకోవడానికి 26న చివరి గడువుగా ఉందని శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆప్షన్ 1, ఆప్షన్ 2లలో ఏదో ఒకటి తమ ఆప్షన్‌గా పెట్టుకోవాల్సి ఉందన్నారు. ఉద్యోగులు అవగాహనతో నిర్ణీత గడువులోగా ఆప్షన్‌ను ఇచ్చుకోవాలని సూచించారు.

దిగబడిన బొగ్గులారీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనికి వెళ్లే మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు పక్కన శుక్రవారం ఉదయం బొగ్గులారీ ప్రమాదవశాత్తు దిగబడింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇటీవల వేసిన రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బర్మ్ వేయకపోవడంతోనే లారీ దిగబడిందని, ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మధునపోచమ్మ జాతర ప్రారంభం

కోటపల్లి: మండలంలోని జనగామ గ్రామంలో కొలువైన మధునపోచమ్మ అమ్మవార్ల జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఉదయాన్నే గ్రామస్తులు అమ్మవార్లను పార్‌పల్లి గ్రామానికి సమీపంలోని గోదావరి నదికి కాలినడకన డప్పు వాయిద్యాలతో మంగళహారతులతో శివసత్తుల పూనకాలతో ఆలుగామ, రొయ్యలపల్లి, పుల్లగామ, ఎదులబంధం, లింగన్నపేట, పార్‌పల్లి మీదుగా కాలినడకన అమ్మవార్లను తీసుకొస్తుండగా గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి నదికి చేరుకున్న తర్వాత నైవేద్యాం తయారు చేయించి అమ్మవార్లకు సమర్పించిన అనంతరం అమ్మవార్లను డప్పుచప్పుళ్లతో భక్తుల శరణఘోషతో గోదావరి నదిలో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున గోదావరి నది ఒడ్డున పుణ్యస్నానం ఆచరించి అమ్మవార్లను దర్శించుకొని తిరుగుప్రయాణంగా జనగామ గ్రామానికి తీసుకెళ్లారు. శనివారం రథయాత్ర, ఆదివారం మధునపోచమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మణ్‌గౌడ్, తిరుపతి తెలిపారు. భక్తులకు జాతీయ రహదారి పై ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



అమ్మవార్లకు జలాభిషేకం చేయిస్తున్న గ్రామపెద్దలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి నికాడి రాహుల్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్ కుమురంభీం కాంప్లెక్స్ ఉట్నూర్‌లో నిర్వహించగా అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో వికారాబాద్ జిల్లా తాండూర్‌లో నిర్వహించనున్న పోటీలలో పాల్గొననున్నారు.

అయ్యప్ప భక్తుల మాలధారణ

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీఅభినవ శబరిమలై అయ్యప్ప ఆలయంలో కార్తికపౌర్ణమి సందర్భంగా శుక్రవారం పలువురు భక్తులు అయ్యప్ప మాలాధారణ గావించారు. సుమారుగా 460 మంది భక్తులు అయ్యప్ప దీక్షా మాలాధారణ చేసుకున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు తెలిపారు. దీంతో అయ్యప్ప ఆలయ ప్రాంగణాలు అయ్యప్పస్వాముల శరణుఘోశతో మార్మోగాయి.

ఘనంగా బిర్సా ముండా జయంతి

కాసిపేట: మండలంలోని దేవాపూర్, మద్దిమాడ, ముత్యంపల్లి, రొట్టెపల్లి తతర ఆదివాసీ గ్రామపంచాయతీల్లో శుక్రవారం ఆదివాసీ స్వాతంత్ర్య సమర యోధుడు శ్రీ భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీసా గ్రామసభలు నిర్వహించారు. ఆదివాసీ నాయకులు ఆడ జంగు, కొమ్ముల బాపు, మడావి వెంకటేష్, సిడం రాందాస్, సంద్ర భూమయ్య, ఆత్రం జంగు, కేశవరావు, ముత్యంపల్లిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఆదివాసీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధి పెగడపల్లిలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా జయంతి నిర్వహించారు. బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. పెసా చట్టంపై అవగాహన కల్పించారు. గ్రామస్తులతో మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి, గ్రామపంచాయతీ ఇంచార్జీ కార్యదర్శి జగదీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.




మద్దిమాడలో నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా

భీమిని: మండలంలోని వెంకటపూర్ గ్రామంలో ప్రియుడు పుట్ట శ్రీకాంత్ ఇంటి ఎదుట ప్రియురాలు పూజిత రెండో రోజు ధర్నా చేపట్టారు. రెండు సంవత్సరాలుగా ప్రేమించి, ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆరోపించింది. న్యాయం చేయాలని శుక్రవారం ధర్నా చేపట్టగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, జిల్లా నాయకులు మద్దతు తెలిపారు. యువతికి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్సై గంగారాం, జిల్లా సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శ్రీలత, సైకో సోషల్ కౌన్సిలర్ జ్యోతి, పారామెడికల్ రమ ఇరు కుటుంబాలకు చెందిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. శ్రీకాంత్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచుకీ కనిపెట్టి చట్టపరంగా యువతికి న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు, సఖీ నిర్వాహకులు హామీ ఇచ్చారు.

కడెం సాగునీటి కాలువ ఆక్రమణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ శివారులో రాపల్లి చెరువును నింపేందుకు వెళ్లే కడెం నీటికాలువ ఆక్రమణకు గురవుతోంది. ఐదు దశాబ్దాల క్రితం కడెం కాలువ చివరి ఆయకట్టు నుంచి సాగునీటి కాలువను అప్పటి కడెం అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేయించారు. ఏటా రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు రాపల్లి చెరువును నింపేందుకు కడెం కాలువ ద్వారా సాగునీటిని అందిస్తున్నారు. ఇటీవల ఈ కాలువను ఆక్రమించేలా ఏకంగా బేస్‌మెంట్‌ను నిర్మించారు. అధికారులు స్పందించి కబ్జా చెరనుంచి కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.



నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

జన్నారం: నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు వ్యవసాయాధికారులు దృష్టి సారించి పరిహారం అందించాలని వ్యవసాయ కార్మిక శాఖ మండల కార్యదర్శి, సీపీఎం నాయకుడు కొండగొర్ల లింగన్న డిమాండ్ చేశారు. మండలంలోని కవ్వాల్ బంగారు తండా గ్రామంలో శుక్రవారం నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల పంటలను సీపీఎం నాయకులు పరిశీలించారు. వ్యవసాయాధికారులు స్పందించి, పంటను పరిశీలించి, నకిలీ విత్తనాలు సరఫరా చేసిన డీలర్‌పై చర్యలు తీసుకుని రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కనుల పండువగా జ్వాలా తోరణం

మంచిర్యాలఅర్బన్: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి జ్వాలాతోరణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం వెలిగించారు. ఆలయం చుట్టూ శివపార్వతుల ఉత్సవమూర్తులతో ప్రదక్షిణలు చేశారు. ఈవో ముక్తారవి, అర్చకులు గోవర్ధన భట్టాచార్యులు, సంగనభట్ల నరహరిశర్మ, బాలక్రిష్ణశర్మ, శ్రీకేష్ శర్మలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.